# జాలి

నరసరావుపేట స్టేషన్లో రైలు ఆగింది... టైమ్ చూసుకున్నాను. ఆరున్నర అయింది. చీకటితెరలు పడుతున్నాయి.

గుంటూరు చేరడానికి మరో గంటన్నర ప్రయాణం చేయవలసి ఉంటుందనుకున్నాను.

నంద్యాల నుంచీ నాతోపాటు ప్రయాణం చేస్తున్న ఒకతను రైలు దిగాడు.

“రండి మాస్టారూ, క్యాంటీన్లో కాస్త కాఫీ తాగుదాం” అన్నాడు.

“పదండి” అంటూ ప్లాట్ఫారం మీదికి దిగి కాస్త దూరంగా ఉన్న రైల్వే క్యాంటీన్‌వైపు నడిచాం... ప్రయాణం వల్లనేమో చికాగ్గా ఉంది నాలో... ఇద్దరం క్యాంటీన్ దగ్గరికి వెళ్లి నిలబడ్డాక, అతను రెండు కాఫీలకి టోకెన్లు తీసుకోబోతూంటే-

“ఆగండి సార్...! అద్దాల్లో గారెలు కనిపిస్తున్నాయి. ఓ ప్లేటు లాగిస్తేగానీ ఆకలి తీరేట్టు లేదు” అంటూ నా జేబులోనుంచి ఇరవై రూపాయల నోటు తీసి క్యాంటీన్ క్యాషియర్‌కి ఇవ్వబోయాను.

“ఫర్వాలేదు నేనిస్తాను” అంటూ అతను జేబులోకి చెయ్యిపోనిచ్చాడు. యాభైరూపాయల నోటు తీసి ఇచ్చాడు. రెండు ప్లేట్ల గారెకి, రెండు కాఫీలకీ టోకెన్స్‌తో పాటు మిగతా చిల్లర కూడా క్షణాల్లో తిరిగి యిచ్చాడు క్యాంటీన్ క్యాషియర్.

క్యాంటీన్ చుట్టూ ప్రయాణీకులు టోకెన్లతో ఎగబడ్డారు కాఫీలకీ, టీలకీ, టిఫిన్లకీ.

ఆ ప్రయాణీకుల్లోనే ప్లాట్‌ఫారంమీద అడుక్కుతినే కుర్రాళ్లు... “అయ్యా... అయ్యా...” అని



కొందరు, “సార్... సార్...” అంటూ మరికొందరు... హడావిడిగా తినేస్తున్న ప్యాసింజర్ల నోళ్ళకేసి చూస్తూ చేతులు చాచి అడుగుతూంటే బాధగానే ఉంది.

మరొకడయితే ప్యాసింజర్లు తిని పడేస్తున్న పచ్చడి ఆకుల్ని నేలమీదకు విసిరేయగానే గబుక్కున దానిమీద పడి పట్టుకుని ఆకులకు అంటుకున్న పచ్చడ్ని నాకేస్తున్నాడు.

ఏడెనిమిదేళ్ల వయసున్న పిల్లలు ఇలా ఎక్కడబడితే అక్కడ అడుక్కుతింటూంటే సమాజం ఏమీ పట్టించుకునే ధోరణిలో లేదన్నది అందరికీ తెలిసిన సంగతే.

పక్కనున్న ఫ్రెండ్ గబగబా చట్నీతో గారె లాగించేస్తున్నాడు. నేనూ గారె ముక్కని పచ్చట్లో ముంచి నోట్లో పెట్టుకోబోతున్నాను. ఇంతలో బక్కచిక్కిన కుర్రాడు నాకు దగ్గరగా వచ్చి దీనంగా నావైపే చూస్తుంటే గుండె తరుక్కుపోయింది. నోట్లోకి గారెముక్క పోలేదు.

బాగా మాసి, అక్కడక్కడా చినిగిన చొక్కా ఆ ఎనిమిదేళ్ల కుర్రాడి ఒంటిమీద వేళ్లాడుతోంది. తైల సంస్కారంలేని జుట్టు... లోతుకు కూరుకుపోయిన కళ్లతో నావైపు చూస్తున్న వాణ్ణి నేను అట్టే చూడలేక తలదించుకున్నాను. కడుపులో తెమిలినట్టనిపించింది.

"ఆగిపోయారేం? తినండి సార్. బండి కదిలే టైం అయినట్టుంది..." అన్నాడు అతను.

నా చేతిలో ఉన్న ప్లేటు గారె పొట్లం తీసి ఆ కుర్రాడికి యిచ్చేయాలనిపించింది. కానీ, ఎంగిలి చేసిన దాన్ని యివ్వడానికి మనసొప్పక గబగబా క్యాంటీన్ దగ్గరకెళ్లి ఓ రెండు గారెలున్న పొట్లం పట్టుకొచ్చి నాకు ఎదురుగా ఉన్న కుర్రాడికి యిచ్చాను.

ఇంతలో మరో కుర్రాడు "సార్... సార్..." అంటూ గబగబా వచ్చేసాడు. నా పక్కనున్న అతను ఫక్కున నవ్వి "మీరు భలేవారండీ... ఇలా ఓ నిమిషం ఆగండి. ఈగల్లా మిమ్మల్ని చుట్టుకుంటారు..." అన్నాడు కాఫీ తాగుతూ.

నేనూ కాఫీ తాగుతూ నేనిచ్చిన ఆ గారె పొట్లం పట్టుకెళ్తున్న ఆ కుర్రాడివైపు చూస్తు



తులసీరాం

న్నాను. వాడు అలా వెళ్లి కొద్దిదూరాన ఉన్న ఓ ముసలమ్మకు ఆ పొట్లం ఇచ్చి, నెమ్మదిగా మళ్లీ ఇటువైపే రావడం గమనించాను. పిల్ల వాడు కదా అని జాలేసి గారెలు కొనిస్తే వాడు తినకుండా ఎవరికో యిచ్చి, మళ్లీ ఇటువైపే వస్తూంటే కోపం వచ్చేసింది నాకు.

ఆ కుర్రాణ్ణి దగ్గరికి పిలిచి చివాట్లు పెడదా మనుకున్నాను. ఇంతలో బెల్‌కొట్టారు...

"రండి మాస్టారూ... బెల్ కొట్టారు..." అంటూ అతను గబగబా పరుగెడుతూంటే నేనూ అతన్ని అనుసరిస్తూనే వాడికి బుద్ధి చెప్పాలని "రేయ్ ఇట్రా"... అని గద్దింపుగా పిలిచాను.

నేను రైలు ఎక్కి తలుపు దగ్గర నిల్చున్నాను. ఆ కుర్రాడు గబగబా వచ్చి నా కెదురుగా చేతులు కట్టుకుని నిలుచున్నాడు. బండి స్లోగా కదిలింది.

"రాస్కెల్... నేను గారెల పొట్లం కొని నీకు యిస్తే తినకుండా మీ అమ్మకు ఇచ్చేసి మళ్లీ వస్తావా...?!" అంటూ గుడ్లురిమి చూసాను.

"నాకు అమ్మా – నాన్నా ఎవ్వరూ లేరండీ. ఆ అవ్వ మా అవ్వకాదు. కాళ్లులేని అవ్వ... పొద్దుణ్ణుంచీ అవ్వకు తిండి లేదు... నేను పచ్చడైనా నాకేస్తుంటాను. కానీ... అవ్వకే...! మీరు యిచ్చిన పొట్లం కళ్ళకు అద్దుకుని తింటున్నది సార్" అన్నాడు.

రైలు కూత వేస్తూ కదిలిపోతోంది. ఆ కుర్రాడు దూరమైపోతూంటే నా గుండె బరువెక్కింది. చెమ్మగిల్లిన కళ్లను జేబురుమాలుతో తుడుచుకుంటూ స్థాణువులా ఉండిపోయాను అలాగే చూస్తూ...!



హెల్త్‌కేర్ ఇంటర్‌నేషనల్ ఆర్గనైజేషన్ 6వ వార్షికోత్సవ సభలో డా॥ సి. నారాయణరెడ్డి నుంచి ఎక్స్‌లెన్సీ అవార్డు అందుకుంటున్న రచయిత్రి వడ్డాది లక్ష్మీ సుభద్ర. అట్లూరి సుబ్బారావు, ఎమ్. వెంకటేశ్వరి, వి.వి. రామారావు ఫొటోలో ఉన్నారు.